# సింగిల్ పేజీ కథలు

## కథాకన్యలు

రెండు నెలల బట్టి శ్రీమతి శ్రీకాంత్ ఒక సినిమా చూపించమని తన భర్త ప్రాణం తీసేస్తోంది. ప్రతీ ఆదివారం, ఏదో ఒక పని తగులుతోంది. సినిమాకి తీసుకెళ్ళడం కుదరటం లేదు. నిన్ననే, ఈ ఆదివారం తప్పకుండా సినిమాకి వెళదాం అన్నాడు. ఇంతలోనే ఈ వారం కూడా కుదరటం లేదు. వాడొకడు. తోడులేకుండా ఎక్కడికీ వెళ్ళడు. అయినా ఈ ఏభై అయిదోపడిలో శ్రమపడి వీడు కథలు రాయడం నేర్చుకోకపోతే ఏం మునిగిపోయిందో. టెలిఫోన్ మోగింది. అది విని వాడే అయి వుంటాడని టెలిఫోన్ రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు శ్రీకాంత్. అవతలనుంచి 'వాడే వీడు' అన్నాడు వాడు. 'వాడేవీడు' అంటే లక్ష్మీకాంతమే. తను కథలు రాయడం నేర్చుకోవడానికి శ్రీకాంత్‌ని వనస్థలిపురం రమ్మన్నాడు. మళ్ళీ జ్ఞాపకం చెయ్యడానికి ఫోన్ చేశాడు. కోఠీలో బస్‌స్టాపుకి, పన్నెండు గంటలకల్లా వచ్చెయ్యమన్నాడు. ఆ ఫోన్ మాట్లాడడం అయిన తర్వాత శ్రీమతి శ్రీకాంత్ అడిగింది "ఎవరండీ ఫోన్"

"ఆ ఏముంది మా ఆఫీసర్! తను యిప్పుడే ఆఫీస్‌కి వచ్చి నా ఫైల్ ఒకటి చూస్తున్నాడట. ఆ ఫైల్ గురించి మాట్లాడాలట! నన్ను పన్నెండు గంటలకల్లా ఆఫీస్‌కి వచ్చెయ్యమన్నాడు" అన్నాడు శ్రీకాంత్.

"అసలు నాకు తెలియక అడుగుతున్నాను. మీ ఆఫీసర్ ఏ కాలేజీలో చదువుకున్నాడండీ! ప్రతీది పక్కని కూర్చుని అరటి పండు వలిచి చేతిలో పెడుతూన్నట్లు చెపుతూంటే, పురాణం విన్నట్లు విని ఓ చేవ్రాలు తగలేస్తాడన్నమాట! ఎవరు చేసే పన్లు వాళ్ళకి తెలియకపోవడం వలనే దేశం యిలా ఏడుస్తోంది! అయితే ఈరోజు కూడా మన సినిమా అంతే సంగతులా?" అని చివరకు, "రండి భోజనం చేసేద్దురుగాని. ఆదివారం కదా మీ క్యాంటీన్ కూడా వుండదు" అని కోపంగా, డైనింగ్ టేబిల్ దగ్గరకి నడిచింది.

మొత్తం మీద భోంచేసి, లక్ష్మీకాంతాన్ని అనుకున్నట్లుగా కలిసి కోఠీ నుంచి వనస్థలిపురం చేరుకున్నారు మిత్రులిద్దరూ.

"రండి రండి మీ గురించే చూస్తున్నాను" అంటూ లోపలికి తీసుకువెళ్ళాడు, కథలు నేర్పే గురువుగారు. గురువు అంటే ఆయన కూడా వీళ్ళ ఆఫీసులోనే పనిచేస్తున్నాడు, కాని మంచి కథా రచయిత.

గురుపత్ని కాఫీలు యిచ్చారు. తర్వాత గురువుగారు లక్ష్మీకాంతానికి కథ ఎలా రాయాలో ఏమిటో అంతా చెప్పాడు. తను రాసిన కొన్ని కథల ఫోటో స్టాట్ కాపీలిచ్చి అవి ఒకసారి చదవమన్నాడు.

ఆయన శ్రీకాంత్‌తో అన్నాడు "పన్లోపని మీరు కూడా కథలు రాయడం నేర్చుకోవచ్చుకదా!"

"ఈ శ్రీకాంత్ కథలు బాగా చెపుతాడు! కథలు చెప్పేవాడికి రాయడం నేర్చుకోవడం చాలా సులువనుకుంటాను" అన్నాడు లక్ష్మీకాంతం.

"కథలు చెప్పడం వేరు. రాయడం వేరూ! ఈరోజుల్లో ప్రతీ వాడు కథలు చెప్పేవాడే! రాయడం మాత్రం కష్టం!" అన్నాడు ఆ గురువుగారు.

మొత్తం మీద ఆ మొదటి క్లాసయిన తర్వాత మిత్రులిద్దరూ వెనక్కి బయల్దేరారు. దార్లో లక్ష్మీకాంతం అన్నాడు "మొట్టమొదటి సారే రెండు కథలు రాయమంటాడేమిట్రా..ఏదో, ఒకటవుతే కష్టపడి రాయొచ్చు!"

"ఏమోరా నాకు తెలీదు! కథలు రాయడం విషయం నాకేం తెలుసు! నేను కథలు చెప్పేవాడ్ని" అన్నాడు శ్రీకాంత్.

"ఏమిటోయ్! ఏదో జోక్‌కి అంటే, సీరియస్‌గా తీసుకున్నట్లున్నావు!"

టాపిక్ మారుద్దామని "ఏరా మీ శ్రీమతి మరి ఈవారం సినిమా కుదరలేదని ఏమీ గొడవ పెట్టలేదా!" అన్నాడు లక్ష్మీకాంతం.

"ఆ ఏముంది! ఆవిడకి ఒక కథ చెప్పాను!"

శ్రీకాంత్‌ని యింటి దగ్గర దిగపెట్టడానికి వచ్చిన లక్ష్మీకాంతానికి, శ్రీమతి శ్రీకాంత్ అన్న మాటలు విన్న తర్వాతకాని తెలీలేదు, నిజంగా శ్రీకాంత్ కథ చెప్పినట్లు.

"ఏమిటి అన్నయ్యగారు మీరు కూడా ఆఫీస్‌కి వెళ్ళారా! మీ ఫైల్ కూడా ఆఫీసర్ చూశారా! అయినా ఈ ఆదివారాలు మిమ్మల్ని ఆఫీస్‌కి పిలవడమేమిటి! మీ ఆఫీసర్ కూడా ఆయన శ్రీమతికి సినిమాలు చూపించరనుకుంటాను!"

'చూసావా నేను నీ గురించి నా శ్రీమతితో అబద్ధాలాడి ఆవిడ్ని మభ్యపెట్టి, నీ కోసం వస్తే నా మీద జోకులు వేస్తున్నావు నువ్వు' అన్నట్లు చూసాడు శ్రీకాంత్ లక్ష్మీకాంతాన్ని.

'సర్లేరా బాబూ వదిలేయ్! ఈ పైన యిటువంటి జోక్స్ వెయ్యను' అన్నట్లు కళ్ళతోనే సమాధానం చెప్పాడు లక్ష్మీకాంతం.

★ ★ ★

ఒక నెల తర్వాత తను రాసిన రెండు కథలు ఆఫీస్‌కి తీసుకొచ్చి, ఆ కథలు గురువుగార్కి చూపించాడు లక్ష్మీకాంతం.

ఆ రెండు కథల్లో ఒకటి పర్వాలేదని, దాన్ని ఏదో ఒక పత్రికకి పంపమన్నారు గురువుగారు. అలా పంపిన కథ రెండు నెలల తర్వాత వెనక్కి వచ్చేసింది.

ఈ విషయం శ్రీకాంత్‌తో చెపితే "అదృష్టంరా!" అన్నాడు.

"ఏమిటి కథ వెనక్కి రావడం అదృష్టమా!" అన్నాడు లక్ష్మీకాంతం. "అవునురా! నాకు తెలిసిన ఒకాయనకి వెనక్కి పంపిన కథ చేతికి అందక, చాలా మనస్థాపానికి గురయ్యాడు. పాపం కథ కాపీ కూడా పెట్టుకోలేదు. తిరిగి రాయలేక చాలా అవస్థపడ్డాడు! అందుకని అలా అన్నాను" అన్నాడు శ్రీకాంత్.

"అది సరే యిప్పుడేం చేద్దాం!" అన్నాడు లక్ష్మీకాంతం.

"ఏం చేద్దాం ఏమిట్రా నాకొక అయిడియా వచ్చింది. నేను యింట్లో వంట చేస్తూంటాను కదా! పొద్దున్న రుచిగా లేని వంటకాన్ని, సాయంకాలం మళ్ళీ బాగు చేస్తాను. అది చాలా బాగుందని నా భార్య పిల్లలూ అందరూ తినేస్తారు. మళ్ళీ ఫ్రెష్‌గా వండాననుకుంటారు వాళ్ళు! ఉదాహరణకి పొద్దున్న ముక్కలపులుసు వండామనుకో! అది రుచిగా లేదు! పొద్దున్న మిగిలిపోయిన పప్పు అందులో వేసి మరగ కాచేస్తే అదే బాగుపడుతుంది. అదే మరి! తినే వాళ్ళ అదృష్టం. అలాగే వెనక్కి వచ్చిన కథని, మరగ కాచిన ముక్కలపులుసులాగా, అక్కడక్కడ మార్చేసి గురువుగార్కి చూపించి, మళ్ళీ యింకో పత్రికకి పంపించు. అలా స్వతంత్రంగా కథ మారుస్తే ఆయన కూడా సంతోషిస్తారు. ఏదైనా పాఠకుల అదృష్టం మీద ఆధారపడి వుంటుంది. ఇంట్లో అయితే తినే వాళ్ళ అదృష్టం అన్నమాట!" అన్నాడు శ్రీకాంత్.

సరే! యిదీ బాగానే వుందని కథని మార్చి యింకో పత్రికకి పంపాడు లక్ష్మీకాంతం. కథ మళ్ళీ వెనక్కి వచ్చేసింది. ఇదే విషయం శ్రీకాంత్‌కి చెపితే "నీ కథకి కుక్కకి వున్నంత విశ్వాసం ఉందిరా! కుక్క చూడు ఎక్కడ వదిలేసినా మళ్ళీ యింటికి వచ్చేస్తుంది!" అన్నాడు.

"ఈ కథలు కూడా ఆడపిల్లలకి పెళ్ళి సంబంధాలు చూసినట్లేరా! ఆడపిల్లకి ఒక సంబంధం తీసుకు వచ్చి చూపిస్తాం. పిల్ల వాళ్ళకి నచ్చదు. అయ్యో! నచ్చలేదే వాళ్ళకి అని కంగారుపడతామా! యింకో పిల్లాడికి చూపిస్తాం కదా! ఎక్కడ ఘటనో! యీ ఘటన అనే మాట వినే వుంటావు. ఆడపిల్లకీ, కథకి తేడా ఏమంటే, ఆడపిల్లకి అయితే కట్నమిచ్చి పెళ్ళి చెయ్యాలి, యిక్కడైతే నీకు కన్యాశుల్కం వస్తుంది. నీ కథ నచ్చి పత్రికలో వేస్తే, నీ కథాకన్య ద్వారా నీకు పారితోషికం వస్తుంది కదా!" అన్నాడు శ్రీకాంత్.

ముక్కల పులుసు మరగకాచిన్నట్లు, కథ యింకొంచెం మార్చి యింకో పత్రికకి పంపించాడు లక్ష్మీకాంతం. మళ్ళీ విశ్వాసం కల కుక్కలా వెనక్కి వచ్చేసింది యీ మార్చిన కథ కూడా!

సరే! అస్తమానూ గురువుగార్ని బాధ పెట్టడమెందుకని మళ్ళీ శ్రీకాంత్‌ని సలహా అడిగాడు.

శ్రీకాంత్ "పోన్లేరా! రెండో కథని ఏ పత్రికకైనా పంపించు. ఈ మొదటి కథ కొన్నాళ్ళు పక్కకి పెట్టు" అన్నాడు.

"ఇదేమిట్రా! పెద్ద పిల్లకి పెళ్ళవకుండా రెండో పిల్లకి పెళ్ళి ఎలా చేస్తాం" అన్నాడు లక్ష్మీకాంతం.

"పెద్దదానికి పెళ్ళి కుదరకపోతే రెండో పిల్లకి పెళ్ళి చేసిన కుటుంబాలు బోల్డు తెలుసు నాకు, ఏం కంగారుపడకుండా, నా మాట విని రెండో కథ పంపించు" అన్నాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ చెప్పినట్లే తన రెండో కథ ఒక పత్రికకి పంపాడు. కథంతా మామూలే! అది వెనక్కి రావడం, మళ్ళీ దాన్ని మార్చి యింకొక పత్రికకి పంపడం! మళ్ళీ అది వెనక్కి రావడం. పిల్ల నచ్చకపోతే మగపెళ్ళివారు పిల్ల ఫోటో జాతకంతో సహా వెనక్కి పంపినట్లు! "నాకు కన్యాశుల్కం వద్దు. కథ వేసుకుంటే చాలురా" అన్నాడు విసిగిపోయిన లక్ష్మీకాంతం, శ్రీకాంత్‌తో.

"ఏం చేస్తాంరా! నాకు తెలిసిన ఒకాయనికి యిద్దరు ఆడపిల్లలు. వాళ్ళిద్దరూ కన్యలుగానే మిగిలిపోయారు. కొంతమందికి వివాహయోగం ఉండదు. నీ కథాకన్యల్ని నీతోపాటే ఉండనీ కన్యాశుల్కం రాకపోతేనేం! మనకి జీతం వస్తోంది! తర్వాత పెన్షన్ కూడా వస్తుంది కదా!" అన్నాడు శ్రీకాంత్.

**-భమిడిపాటి సోమయాజి (హైదరాబాద్)**